



అమెరికా పర్యటనలో భాగంగా.. ఆదివారం డల్లాస్‌లో నిర్వహించిన ఐటీ భాగస్వామ్య కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ డల్లాస్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబు నేతృత్వంలోని బృందం

# అయోవాతో అవగాహనా ఒప్పందం

- **వ్యవసాయం, శాస్త్ర సాంకేతికత, లైఫ్‌సైన్స్ రంగాల్లో పరస్పర సహకారం**
- **ఒప్పంద పత్రాలపై సీఎం సమక్షంలో సంతకాలు చేసిన యనమల, బిల్‌నార్తే**

**ఈనాడు, అమరావతి:** వ్యవసాయం, శాస్త్ర సాంకేతికత, వ్యవసాయంలో పరిశోధన- అభివృద్ధి, లైఫ్ సైన్స్ తదితర రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, అయోవా వ్యవసాయ, భూ యాజమాన్యశాఖ (అమెరికా) నిర్ణయించాయి. ఇందులో భాగంగా అయోవా రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు, ఇక్కడి నుంచి అయోవాకు ప్రతినిధుల బృందాల పర్యటనలు, ఇరు రాష్ట్రాల్లోని ప్రఖ్యాత సంస్థల మధ్య సంప్రదింపులు, పరస్పరం అనుభవాలు పంచుకోవడం వంటి అంశాల్లో రెండు రాష్ట్రాలు సహకరించుకోనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, అయోవా రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి బిల్ నార్తేలు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి, అయోవా తరఫున అయోవా వ్యవసాయ, భూయాజమాన్యశాఖ ఈఒప్పందాన్ని అమలు చేయనున్నాయి. ఐదేళ్లు అమల్లో ఉండే ఈ ఒప్పందం విత్తనోత్పత్తి, పరిశోధన అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా చంద్రబాబు, అయోవా రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి బిల్ నార్తేలు ప్రసంగించారు.

**రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యం: ముఖ్యమంత్రి..** 'రైతులకు ఆదివారాలు, సెలవు దినాలు వంటివేమీఉండవు. ఆక్రమంలోనే అయోవా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఈ ఆదివారాన్ని సెలవు దినంగా చూడకుండా వ్యవసాయ రంగం అభివృద్ధికి దోహదం చేసే కీలక ఒప్పందాన్ని కుదుర్చుకోవడం శుభసూచకం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. వ్యవసాయ రంగంలో మార్పులను గమనించి వాటికనుగుణంగా మారుతున్నాం. ఒకప్పుడు ఆహార ధాన్యాల వినియోగం బాగుండేది. ప్రస్తుతం పండ్లు, చేపలు, కోళ్లు, మాంసాహార వినియోగం పెరిగింది. విత్తనాభివృద్ధికి, పరిశోధనలకు ఈ రోజు కుదుర్చుకున్న ఒప్పందం కీలకం కానుంది. దీనివల్ల వ్యవసాయ దిగుబడులు పెరుగుతాయి'అని సీఎం పేర్కొన్నారు.

**అయోవా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య సామీప్యత: బిల్ నార్తే..** 'అయోవాకు, ఆంధ్రప్రదేశ్‌కు అనేక అంశాల్లో సామీప్యత ఉంది. రెండు రాష్ట్రాలు వ్యవసాయ ప్రధానమైనవే. మొక్కజొన్న, సోయా పంటల్లో అగ్రగామిగా ఉన్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతుల జీవితాలను మరింత మెరుగుపరిచేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది' అని బిల్ నార్తే పేర్కొన్నారు.

**అయోవాలో పలు కార్యక్రమాల్లో..** ముఖ్యమంత్రి నాలుగోరోజు అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం అయోవా రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజధాని డి మో ఇన్‌లో స్థానిక తెదేపా ఫోరం, ఏపీ ఎన్ఆర్‌టీ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ప్రవాస తెలుగు ప్రజలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఇక్కడ గత ఏడాది కాలంలో 750 కొత్త కంపెనీలను తెలుగువారు స్థాపించారని తెలుసుకుని చాలా సంతోషించానని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు.